# అంతర్జ్వాల

పాలడుగు వెంకటేశ్వరరావు



బందరులో చదువుకుంటూ ఉన్న మా మేనల్లుడిని చూసి వద్దామని బయలు దేరాను. గుడివాడ 'బస్టాండు'లో పీలారు నుంచి రావలసిన బస్సు కోసం ఎదురు చూస్తూ వున్నాను. గంట సేపటి నుంచి చూస్తూ వున్నా బస్సు అయిపు లేదు. 'బస్టాండు' ప్రయాణీకులతో కిటకిటలాడుతూ వున్నది.

"నమస్కారం బాబూ! ఎక్కడికి బయలు దేరారు?" పరిచయమున్న గొంతు.

చిరాకుగా ఆలోచనల్లో మునిగివున్న నేను ఈ మాటలతో బయటపడి తల ఎత్తి చూశాను. నాకు ఎదురుగా 'సీతారాముడు' నిలబడి వున్నాడు.

చింకిబారు లాల్చీ, అదుపులేకుండా ఎదిగి మొహం మీద పడుతూ వున్న జుట్టూను. గారపట్టిన పళ్ళతో ఎర్రగా అసహ్యంగా వున్న నోరు. మాసిపోయి నల్లగా వున్నాయి బట్టలు. శరీరం చెమటలతో ముదిరి కొడుతూ వున్నది. అతని పక్కనే నేస్తాలు కాబోలు మరో ఇద్దరు అదే అవతారంలో వున్నారు.

నాకు అసహ్యం వేసింది. అసలే చిరాకుగావున్న నాకు సీతారాముణ్ణి చూసి మరింత విసుగేసింది. చాలాకాలానికి కనబడిన సీతారాముడు నాలో కొంచము కుతూహలమూ కలిగించక పోలేదు.

"మనవూళ్ళో అందరూ బాగా ఉన్నార బాబూ!"

"ఆఁ."

"ఎక్కడికి బయలుదేరినట్లున్నారు."

"వూరికి వెడదామని."

అస్పష్టంగా సమాధానం ఇచ్చాను. నేను ఎక్కడికి వెడుతున్నదీ సీతారాముడికి తెలియడం నాకు ఇష్టంలేదు. వీడు, నానుంచి ఏవీ కోరడేం, నన్ను కావాలని వదిలిపెట్టడం లేదా?

"టికెట్టు తీసుకున్నారా?"

"లేదు."

"ఇంకా ఇవ్వడం లేదల్లే వుంది. బస్సు వచ్చినాక ఇస్తారేమో?"

సీతారాముడి నేస్తాలిద్దరూ అవతలికి వెళ్ళి బీడీలు కాల్చుకుంటున్నారు.

బస్సు వచ్చింది.

కండక్టరు బస్సు దిగి 'బుకింగు' వద్దకు నడిచాడు.

'బుకింగు' వద్ద జనం కిటకిట లాడుతూ వున్నారు. బాగా రద్దీగా వున్నది. ఈ 'తొక్కిడి' లో 'టికెట్టు' తెచ్చుకోవడము నాకు అసాధ్యముగా తోచింది.

నిస్సహాయంగా అటువైపే చూస్తూ వున్న నన్ను సీతారాముడు అడిగేడు: "మీరు వెళ్ళవలసింది ఆ బస్సుకేనా?"

"అవును." అన్నాను.

"ఏవూరు వెళ్ళాలో చెప్పండి. నేను 'టికెట్టు' తెచ్చిపెడతాను." అన్నాడు.

సీతారాముడి మీద నాకు చెప్పలేనంత అయిష్టంగావుంది. వాడితో మాట్లాడటం నాకు ఏమాత్రమూ ఇష్టము లేదు. కాని ఇప్పుడు నాకు వాడి సహాయమే అవసరమయింది. నేను ఆ రోజే తప్పకుండా బందరు వెళ్ళి చూడవలసిన 'విషయాలు' కొన్ని వున్నాయి. తరువాత బస్సులో మాత్రం నాకు సీటు దొరుకుతుందన్న నమ్మకం ఏమిటి? ఇప్పట్లో 'రైలు' కూడా వున్నట్లు లేదు.

అయిష్టంగానే పేరు చెప్పి డబ్బులిచ్చాను.

సీతారాముడు జనంలో దూరబడ్డాడు.

మరో పది నిముషాలలో 'టికెట్టు' తీసుకుని బయటికి వచ్చాడు నవ్వుతూ. అప్పుడే టికెట్లు అయిపోయాయని, మిగిలి పోయిన జనం నిరుత్సాహంగా ఇవతలకు వచ్చేస్తున్నారు. నేను నిజంగా అదృష్టవంతుణ్ణి!

నన్ను బస్సు ఎక్కించి, బయలుదేరేదాకా ఎన్నో విషయాలు మాట్లాడుతూనే వున్నాడు సీతారాముడు. అందరినీ పేరు పేరునా క్షేమం అడిగేడు. సీతారావమ్మగారూ, వెంకట సుబ్బయ్యగారూ ఎలా వున్నారని తరచి తరచి అడిగేడు.

ముక్తసరిగా సమాధానాలు చెప్పేను. బస్సు బయలు దేరింది. సీతారాముడు వెనకనే మిగిలి పోయేడు.

వాడి గురించిన స్మృతులు మాత్రం నన్ను వదిలిపోలేదు.

నిజంగా బతకడం అన్నది ఒక కళ. కొంతమంది బయటికి ఎన్నో బాధలు పడుతూ వున్నట్లు కనిపించినా, అంతరంగంలో ఒక చిన్న చోటు ప్రత్యేకించుకుని అందులో సంతోషం ప్రతిష్ఠించుకుంటారు. మరికొందరు, బయటికి ఎంతో బాగా వున్నట్లు నటిస్తూ లోలోపల దుర్భర వేదనని, మనస్సుని పిచ్చి పిచ్చిచేసే జ్ఞాపకాల్ని పదిలపరచుకుంటారు. ఈ బాధలూ సుఖాలూ అసలు పట్టించుకోకుండా యాంత్రికంగా బ్రతుకును వెళ్ళబుచ్చడంలో 'తృప్తి' పడతారు మరికొందరు. ఇవన్నీ, మరెన్నో కాక మరొక రకమయిన తెగ ఉన్నది మనుషుల్లో. వాళ్ళకి బ్రతుకుమీద ఒక అభిప్రాయమంటూ వుంటుందో లేదో తెలియదు. వారి జీవితం కాల్చి వేసే మంట వంటిది. వాళ్ళు కావాలనుకున్న వాళ్ళకీ, బాధా, భయమూ తప్ప వాళ్ళు ఇవ్వగలిగింది మరేమీ వుండదు. మనస్సుని పిచ్చి పిచ్చి చెయ్యగల జ్ఞాప

'దబదబ' మని దెబ్బలు పడిన చప్పుడు!

ఇక నిలబడలేక పోయాను. ఆరడుగుల ఎత్తున్న ప్రహారీ గోడని పాకి లోపలికి వెళ్ళాను. చావిడిలో గొడ్లు నెమరు వేస్తూ చెవులతో దోమల్ని, ఈగల్ని ఉదారంగా తోలుతున్నాయి.

గాడి లోని చెత్తలో ఎవరో పడుకుని నిద్ర పోతున్నట్టు తెల్లగా అగుపిస్తున్నది. గబగబ అడుగులు వేశాను.

ఇంటి తలుపులు దగ్గరగానే వేసి వున్నాయి. చప్పుడు కాకుండా తీసి లోపలికి వెళ్ళాను.

'వడమటింటిలో గుడ్డిలాంతరు వెల్తురులో నేను చూసిన దృశ్యం నన్ను ఆశ్చర్యంలో ముంచి వేసింది.

సీతారామమ్మగారు, కారుతున్న కన్నీటి చారికలు మొహాన్ని వికృతంగా మార్చగా, స్తంభానికి ఆనుకుని నిలబడి వుంది.

వెంకట సుబ్బయ్యగారు నోట మాటరాక నిశ్చేష్టులై శరీరాన్ని అప్పగించి నిలబడి వున్నారు. సీతారాముడి బలమయిన చేతులలో ఆయన చొక్కా బిగించి పట్టుకోబడి వుంది.

నాకు ఆశ్చర్యమూ కోపమూ కలిగాయి.

సీతారాముడి మీదికి దూక బోయాను.

"ఆగు అన్న సీతారామమ్మగారి గర్జన విని ఆగిపోయాను. విరసనగా మొహం విదిలించాడు సీతారాముడు. "ఛీ!" అని పట్టు ఒదిలించాడు సీతారాముడు. తల వంచుకుని చకచకా నడిచి తలుపు తీసుకుని వెళ్ళిపోయారు వెంకట సుబ్బయ్యగారు. నేను అక్కడున్న విషయం ఆయన గ్రహించినదీ

## అంతర్జ్వాల

లేనిదీ అనుమానాస్పదమే. ఆయన నిలువునా వణికిపోతున్నారు. వెంకటసుబ్బయ్యగారు వెళ్ళిపోయేక సీతారాముడి వంక చూశాను. సీతారాముడి కళ్ళు విస్ఫులింగాలా వెలుగుతున్నాయి.

మరుక్షణం నానుంచి చూపులు మరల్చుకుని సీతారామమ్మ వంక దీనంగా, బాధగా, ఆర్ద్రంగా, జాలి కలిగించేటట్లు చూశాడు.

ఆమె తల వంచుకుని బాధగా వెక్కిళ్ళు పెడుతున్నది.

అప్రయత్నంగానే నా అడుగులు బయటకి పడ్డాయ్! ఆ వాతావరణంలో నిలబడివుండటం నాకు భరించరానిదిగా అయింది.

మనస్సులో అనేక ప్రశ్నలు. నేను చూస్తున్నది అంతా నిజమేనా అన్నది అసలు ప్రశ్న.

వెంకట సుబ్బయ్యగారు ఎందుకు వచ్చారు ఇక్కడికి ఈవేళ?

సీతారాముడంటే, వాడు ఎందుకు వచ్చిందీ నేను అర్థం చేసుకోగలను. సీతారాముడంతటి అల్పుడిచేత అంత అవమానమూ సహించి ఆయన మారు మాట్లాడక ఎందుకు వెళ్ళిపోయినట్లు? అంత పెద్ద మనిషి నిశ్చేతనంగా నిలబడిపోయి దెబ్బలు తిన్నాడు! ఇవీ నాలో వుద్భవించిన సమాధానం దొరకని ప్రశ్నలు.

ఎడ్లగాడిలో నుంచి పకిలింపు వినబడి తలెత్తి చూశాను.

అక్కడే చుట్ట కాల్చుకుంటూ కూర్చుని వున్నాడు, ఒక మనిషి, చీకట్లో తెల్ల తెల్లగా.

"ఎవరది?" అన్నాను.

"నేను బాబూ వీరయ్యని."

"లోపల అంత గొడవ జరుగుతూ వుంది. తాగి, వెంకటసుబ్బయ్యగారిని ఆ కొడుకు అల్లరి పెడుతూవుంటే నువ్వు చీమయినా కుట్టనట్టు కూర్చున్నావా?" అన్నాను కోపముగా. వీరయ్య మాట్లాడలేదు కాసేపు. ఐదు నిముషాల తర్వాత ఆవేశంగా, "అందులో పరాయి వాళ్లెవరు బాబూ? కాకపోతే ఆ 'సన్నాసి'కి 'సీతారామమ్మ తల్లి' 'చల్లని తల్లి'ని మాత్రం తెలుసే గాని ఆ 'సంగతి' తెలియదు. అందుకే గొడవ. ఇది ఇప్పుడు సంగతా? ఆడు పుట్టక ముందు సంగతాయె. 'తల్లిదండ్రులూ' కన్న కొడుకూ మధ్యన నేనెందుకు బాబూ? నేను పిచ్చాణ్ణనుకున్నారా? కాకపోతే ఆనాడు ఆణ్ణి నా కడుపులో పెట్టుకోక......"

నేను నిర్విణ్ణుడనయ్యాను! శరీరంలో 'విద్యుత్' ప్రవహించినట్లయింది.

టక్కున ఆపేశాడు, వీరయ్య, ఏదో జ్ఞాపకం వచ్చినట్టు. పళ్ళు గట్టిగా కరుచుకుని వూరుకున్నాడు వీరయ్య, ఇక మీద నోరు జారకుండా వుండాలన్నట్టుగా.

"తమరు పట్నం నుంచి వస్తున్నారా బాబూ?" అన్న వీరయ్య ప్రశ్నకి సమాధానం చెప్పకుండా గబగబా అడుగులు వేశాను. ●




